

కథా కౌముది

# సరస్వతీ నమస్తుభ్యం

పోల్నాప్రగడ జనార్ధనరావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"**మీరెన్నయినా చెప్పండి.** మావయ్యగారికి తన శిష్యుడు ముకుందంగారంటే వల్లమాలిన మక్కువ. ముకుందంగారికి జనం నాడి బాగా తెలుసునని మావయ్యగారికి గట్టి నమ్మకం. తన శిష్యుడు అందనంత ఎత్తుకెదిగాడని, ఈయన ఏనుగెక్కినంత సంబరపడతారు" ముకుందం అంటే తన భర్తకి ఇష్టం లేదని తెలిసినా నిర్మొహమాటంగా చెప్పింది పద్మ.

"పిచ్చి మొద్దూ! ముకుందానికి 'ఎ'కారం మీద మమకారం ఎక్కువ. 'ఎవరితో', 'ఎప్పుడు?' 'ఎక్కడ?', 'ఎందుకు?, 'ఎలా?' మాట్లాడాలో బాగాతెలుసు. పాలిత ప్రభువుల పల్లకికి ముకుందం పరిమినెంటు బ్యాంకు. రాజకీయ పార్టీలకి అతీతుడు. రూలింగ్ పార్టీకి అనుకూలుడు. కథలూ, కవిత్వం రాస్తాడు. ప్రభుత్వం వారు ప్రకటించిన, ప్రకటించబోయే, తెలుగు భాషకి సంబంధించిన ఏ కార్యక్రమంలోనైనా వేలుపెడతాడు. వేలకి వేలు గడిస్తాడు. పైరవీలు చేస్తాడు పదవులు చేపడతాడు. ప్రభుత్వం వారిచ్చే రాజలాంఛనాల్ని, రాయితీల్ని ప్రభుత్వానికే తెలియకుండా రాబడతాడు, స్వాహా చేస్తాడు.

ఒకసారి ఏమైందో తెలుసా? నాన్నగారు టీచరుగా పనిచేస్తున్న రోజుల్లో 'తెలుగు భాషాసమితి' ఆహ్వానం మీద విజయవాడ వచ్చాడు ముకుందం. ఆర్గనైజర్లు గెస్ట్ హౌస్ అరేంజ్ చేసినా అక్కడొద్దని మన ఇంట్లోనే వున్నాడు. 'మాష్టారి మాట వింటూంటే నాకు వేదం వింటున్నట్టు వుంటుంది. అమ్మగారు పెట్టింది తింటూంటే అమృతం తిన్నట్టు వుంటుంది' అంటూ అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకీ చెప్పి, వెడుతూ వెడుతూ అమ్మా నాన్నల కాళ్ళకి దణ్ణం పెట్టి, బట్టలు పెట్టి వెళ్ళాడు.

అసలు సంగతి తర్వాత తెలిసింది. నాన్నగారు కేంద్రప్రభుత్వం ప్రకటించబోయే 'ఎవార్డు' కమిటీలో మెంబరని, ముకుందం ఆ ఎవార్డ్‌కి ట్రైచేస్తున్నాడని, అందుకే మన ఇంటికి వచ్చాడని" విపులంగా భార్యకి చెప్పాడు తిలక్.

"ముకుందంగారు చాలా గొప్పవారనుకున్నానే. ఏ పని చేసినా అంత ప్లాన్డ్‌గా వుంటారా? ఇవన్నీ మావయ్యగారికి తెలియవా?"

"తెలియవు. నాన్నగారికి ఆయన శిష్యుల్లో మంచే కనబడుతుంది. మనిషంటేనే మంచీ చెడుల కలయిక. మనం మాత్రం మనిషిలో మంచే చూడాలి, చెడు చూడకూడదంటారు. అదే నాన్నగారు మనిషిని బేరీజు వేసే పద్ధతి. "

"ఎందుకో తెలియదుగానీ, మావయ్యగారు నిన్నటినుంచీ దిగులుగా వున్నారు"

"ముకుందం మీటింగ్‌కి నాన్నగారిని అనవసరంగా రవీంద్రభారతికి తీసుకెళ్ళానని ఇప్పుడనిపిస్తోంది."

"అక్కడేం జరిగింది?"

"ఏం జరగలేదు. ముకుందం నాన్నగారికేసి చూడకుండా వెళ్ళిపోయాడు. అది అతని నైజం పట్టించుకోకండి అన్నా, నాన్నగారు బాధపడుతున్నారు"

"అసలక్కడికి మావయ్యగారిని ఎందుకు తీసుకెళ్ళారు?"

"నాన్నగారు రాసిన 'సులభగణితం', 'మూక కవి జీవితచరిత్ర' పుస్తకాల్ని, ముకుందం ఆవిష్కరించడం గురించి, నాన్నగారే స్వయంగా మాట్లాడతానంటే... "

"మనల్ని పట్టించుకోని వాడివెనకాల మనమెందుకు పడాలి?"

"ఆ మాటే నేనూ అన్నా. అప్పుడు నాన్నగారు 'నేను ఆ పుస్తకాల్ని రాస్తున్నప్పుడు ముకుందం చూసి, మాష్టారూ! ఈ పుస్తకాల్ని నేనే ఘనంగా ఆవిష్కరిస్తా. ఆ అదృష్టాన్ని నాకే ప్రసాదించమని చేతులు పట్టుకుని ప్రాధేయపడితే సరే అన్నాను. ఇప్పుడు మాట తప్పకూడ'దన్నారు"

"అత్తయ్యగారు పోయాక, మావయ్యగారు మన దగ్గరే హైదరాబాదులో వున్నారని ముకుందం గారికి తెలియదా?"

"అదే ముకుందంలో దాగున్న మరో పార్శ్వం. తనకి అవసరమైనవన్నీ తెలుసుకుంటాడు. కానీ ఏమీ తెలియనట్టు వుంటాడు. నాన్నగారిచే ప్రామిస్ చేయించుకున్నప్పుడు చాలా చిన్నస్థాయిలో వున్నాడు. తర్వాత తర్వాత సాహిత్యాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాల్లోకి దూరి, పైరవీలు చేసి పాపులరయ్యాడు. అప్పుడు ముకుందాన్ని కేంద్రప్రభుత్వ ఎవార్డ్‌కి రికమెండ్ చేయలేదని, నాన్నగారి మీద కోపం కూడా వుంది" తండ్రి రాక చూసి ఇంక ఈ విషయం మాట్లాడకు అన్నట్టు కళ్ళతోనే సౌంజ్ఞ చేసి చెప్పాడు తిలక్.

నారాయణరావు మాష్టారికి గణితం ఊపిరి. సాహిత్యం ప్రాణం. రిటైర్ అయినా, వికలాంగులకి, బీదవిద్యార్థులకి వుచితంగా పాఠాలు చెప్పడం అంటే సరస్వతీ దేవికి పూజ చేసినంత ఆనందం. ఆయన ఇల్లో సరస్వతీ నిలయం.

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలలో ఆయన శిష్యులు వున్నత పదవుల్లో వున్నారు. వాళ్ళు వచ్చి మాష్టారి ఆశీర్వాదం తీసుకుంటారు కానీ, ఆయన మాత్రం సిఫార్స్‌లకి, స్వప్రయోజనాలకి వాళ్ళ దగ్గరికి వెళ్ళరు.

మాష్టారు విపులీకరించిన, విశ్లేషించిన అనేక లెక్కల సూత్రాలు పెద్ద బాలశిక్షలోనే కాదు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ పుస్తకాల్లో కూడా అగ్రస్థానం వహించాయి.

ఆ సూత్రాలన్నీ క్రోడీకరించి 'సులభగణితం' పుస్తకం పిల్లలకి, పెద్దలకి అర్థమయ్యేలా రాసారు.

మూక కవి కామాక్షీ అమ్మవారి తాంబూల కబళం ప్రసాదంగా తిని, మూగతనం పోయి, ఆశువుగా మూక పంచశతి, శ్లోకాలతో అమ్మవార్ని స్తుతించడం గురించి 'మూకకవి జీవిత చరిత్ర'లో రాసారు. తన కష్టార్జితంతో ఆ పుస్తకాల్ని ప్రింట్ చేయించారు. విద్యార్థులకి, భక్తులకి కాకుండా, తను రాసిన పుస్తకాల గురించి అందరికి తెలిసేలా పుస్తకావిష్కరణ జరగాలని ఆయన కోరిక.

ఆ బాధ్యత ముకుందం తన భుజాల మీద వేసుకుంటానని మాష్టారికి మాటవరసకి మాట యివ్వడంతో, ఆ రోజు కోసం నిజంగా ఎదురు చూస్తున్నారు పాపం నారాయణరావు మాష్టారు.

"ఉచితంగా ఏది దొరికినా మనిషికి వాటి విలువ తెలియదు. ధర పెరిగిన కొద్దీ వస్తువు మీద మమకారం పెరుగుతుంది. ఆకర్షణ ఎక్కువ అవుతుంది. అది కష్టమర్ సైకాలజీ నాన్నగారూ..!. రచయిత తను రాసిన పుస్తకం మిత్రులకి బహుమతిగా యిస్తే, వుచితంగా వచ్చింది, చదువుదాంలే అని బద్ధకించి పక్కన పడేస్తాడు. అదే కొన్న పుస్తకం అయితే భద్రంగా దాచుకుని శ్రద్ధగా చదువుతాడు. ఇదే

జరుగుతుంది వుచితంగా యిస్తే మీ పుస్తకాల విషయంలో కూడా. యివన్నీ మీకు తెలియవని కాదు. కాస్తో, కూస్తో వాటికి ధర పెట్టండి" అన్న తిలక్ మాటలకి ససేమిరా ఒప్పుకోలేదు నారాయణరావుగారు.

"కాటుక కంటి నీరు... అల్ల కర్నాట కిరాత కీచకులకి అమ్మ త్రిసుద్ధి కనవమ్మ భారతీ" అంటూ పోతనగారు సరస్వతీదేవి ముందు కన్నీళ్ళు పెట్టుకున్న వుదంతం చెప్పి, "ఆ మహానుభావుడే నాకు ఆదర్శం. పుస్తకాలు అమ్మడం విషయంలో నన్ను మభ్యపెట్టకు నాయనా" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నారు మాష్టారు.

"సరే మీ ఇష్టం. కానీ ఎన్నాళ్ళని ఆ ముకుందం గురించి ఎదురు చూస్తారు. మీ శిష్యుల్లో ఎంతో మంది గొప్పవారున్నారు. వాళ్ళల్లో ఎవరో ఒకరిచేత ఆ పుస్తకాల్ని ఆవిష్కరింప చేద్దాం నాన్నగారూ!"

"ఒద్దురా. నేను ముకుందానికి మాటిచ్చా. మాట తప్పితే వాగ్దేవి కృపకి దూరమవుతా. ఆ 'శాస్త్రరూపిణ్యై' అనుగ్రహంతోనే నేనీ పుస్తకాల్ని రాసా. నీకు చోళుల కాలంలో ప్రసిద్ధికెక్కిన కంబకవి కథ తెలుసా?"

"తెలీదు. చెప్పండి."

"కంబకవి పాండిత్య ప్రతిభకు ముగ్ధులై రాజుగారు, కవి కుటుంబాన్ని విందుకు ఆహ్వానించారు. రాజుగారే స్వయంగా వడ్డిస్తూంటే ఆయన పంచె కుచ్చెళ్ళు జారాయి. అది చూసి కంబకవి కొడుకు కిలకిలా నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నాడని రాజుగారు అడిగారు. కంబకవి సమయస్ఫూర్తిగా 'మహారాజా! మండు వేసవిలో ఓ పండు ముసల్ది చెప్పులు ఓ చంకలో గొడుగు మరో చంకలో పెట్టుకుని కాళ్ళు కాలుతూంటే, నెత్తి మాడుతూంటే వడివడిగా నడుస్తోంది. దాని తెలివి తక్కువ తనానికి నా కొడుకు నవ్వాడు పసివాడ్ని క్షమించండి' అన్నాడు రాజుగారికి అనుమానమొచ్చి భటుల్ని పిలిచి రోడ్డు మీద ముసల్ది వుందో లేదో చూసి రమ్మన్నారు.

కంబకవి సరస్వతీ ఉపాశకుడు. కొడుకుని రక్షించమని ఆ విధ్యాధర్ని ప్రార్థించాడు. ఆ కామరూపిణి భక్తుడి మొరాలకించి ముసల్దాని రూపంలో చంకలో చెప్పులూ, గొడుగుతో నడిచి వెళ్ళింది. సరస్వతీ అనుగ్రహం వుంటే నా పుస్తకాలు ప్రాప్తమున్నవాడికి చేరి జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. "

"నాన్నగారూ! త్వరలో మీ పుస్తకాల్ని మీ ప్రియశిష్యుడు ముకుందం చేతే ఆవిష్కరింప చేసే ఏర్పాటు చేస్తా. మీరు నిశ్చింతగా వుండండి" అన్నాడు తిలక్ ముకుందాన్ని పిలవడం ఇష్టంలేకపోయినా.

"మాష్టారూ! మీరు రిటైరయ్యాక ఎక్కడున్నారో తెలుసుకుందుకు ఎన్నో ప్రయత్నాలు చేసా. మీ శ్రీమతిగారు పోయారని తెలిసి ఎంతో బాధపడ్డా. ఆవిడ నిజంగా అన్నపూర్ణే. ఆవిడ పెట్టిన అన్నం తిన్నవాడ్ని. ఆవిడ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించా. ఆవిడపేరు శాశ్వతంగా వుండేలా ఓ ప్రపోజల్‌తో మీదగ్గరకి వచ్చా" అన్నాడు ముకుందం.

"ఏమిటది?" కుతూహలంగా అడిగారు మాష్టారు అంతకు ముందు ముకుందం తనని చూడకుండా వెళ్ళిపోయిన సంగతి మర్చిపోయి.

"మీ శ్రీమతిగారి పేరు మీద 'సరస్వతీ పీఠం' నెలకొల్పి, బదిరులకు ఉచితంగా విద్యనేర్పాలి. దానికి ఛైర్మెన్‌గా మీరే వుండాలి. వాటికి సంబంధించిన డాక్యుమెంట్సు తెచ్చా. మీరే సంతకాలు పెట్టండి. మిగతా విషయాలు నేను చూసుకుంటా. అప్పుడే ఎవరికి ఆఖరికి మీ అబ్బాయికి కూడా ఈ విషయం చెప్పకండి. నలుగురికి తెలిస్తే రాజకీయ ఒత్తిళ్ళు తట్టుకోలేను. మొదలకే మోసం వస్తుంది."

"అలాగే ముకుందం. అన్నట్టు..." ఏదో అడగబోయి తటపటాయించారు మాష్టారు.

"ఆ..మర్చిపోయా. మీ పుస్తకాల ప్రింటింగ్ పూర్తి అయిందా?"

"అయింది"

"మర్చిపోకండి. ఆ పుస్తకాలు నాచేతే ఆవిష్కరింపచేస్తానని మాటిచ్చారు"

"ఆ విషయం నీతో మాట్లాడదామని, వికలాంగుల వార్షికోత్సవానికి నువ్వు ముఖ్య అతిధిగా వస్తున్నావని తెలిపి, మా అబ్బాయిని తీసుకుని రవీంద్రభారతికి వచ్చా... కానీ..."

"సారీ మాష్టారూ! ఆ హడావిడిలో మిమ్మల్ని చూడలేదు. చూస్తే వదులుతావా? పుస్తకావిష్కరణకి ఏర్పాట్లు చేసుకోండి. ఏదైనా సాంస్కృతిక సమాఖ్యద్వారా ఫంక్షన్ జరిపితే జనం బాగా వస్తారు. పుస్తకాలకి మంచి పబ్లిసిటీ వస్తుంది. మీ అబ్బాయిని నాకు ఫోను చెయ్యమనండి. వుంటామరి. నే చెప్పిన విషయం రహస్యంగా వుంచండి" అంటూ మాష్టారి కాళ్ళకి నమస్కరించి, సంతకాలు పెట్టించుకున్నాడు.

మాష్టారి ప్రియ శిష్యుడు ఢిల్లీలో పెద్ద పదవిలో వున్నాడు. ఆ విషయం తెలిసాకే 'సరస్వతీ పీఠం' ఆలోచన వచ్చింది ముకుందానికి. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకోవచ్చు ననిపించింది. మాష్టారిపేరు కాగితాల్లో చూపించి, కావల్సినవి ఎప్రూవ్ చేయించుకుని ఫలితాలు తను పొందొచ్చు అన్న ఆనందంతో వెళ్ళాడు ముకుందం.

పుస్తకావిష్కరణ సభ, కళావాహిని సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అద్భుతంగా జరిగింది.

నారాయణరావు మాష్టారి గురించి గొప్పగా మాట్లాడి జనం చేత చప్పట్లు కొట్టించాడు ముకుందం.

పుస్తకాల్లోని పేజీలు చదివాడు మాష్టార్ని కలిస్తే ఈ పుస్తకాలు వుచితంగా లభిస్తాయి. ఎడ్రస్ ఇందులో వుంది అంటూ పుస్తకాల్లో విషయాలకంటే, తను ఎంత కష్టపడి ఎదిగింది చెప్పుకొచ్చాడు ముకుందం.

శిష్యులు శాలువాలతో, పూలమాలతో మాష్టార్ని సత్కరించారు. కార్యదర్శి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. వేదిక దిగి అందరూ వెళ్ళిపోయారు.

మాష్టారు మాత్రం, వివాహం అయిన తర్వాత ఖాళీ అయిన కల్యాణ మండపాన్ని చూస్తున్న కన్యాదాతలా, వేదిక మీద అశాంతిగా, దిగులుగా ఏదో పోగొట్టుకున్నట్టు ఒంటరిగా వుండిపోయారు.

"ముకుందంగార్ని ఆవిష్కరణ సభకి ఎలా ప్రలోభపెట్టి అర్జెంటుగా తీసుకురాగలగారు?" భర్త తెలివితేటలకి ఒక పక్క మురిసిపోతూ, మరో పక్క కుతూహలం కొద్దీ మురిపంగా అడిగింది పద్మ.

"పిచ్చి మొద్దూ! ముకుందంలాంటి వాళ్ళని పట్టుకుందుకు పెద్ద కసరత్తు చెయ్యక్ఖర్లేదు. కొన్ని కొన్ని సాంస్కృతిక, సాహిత్య సమాఖ్యలకి వీళ్ళు నిలవ(య) విద్వాంసులు. ఆ సంస్థల్కి వీళ్ళకి కొన్ని ఒప్పందాలు, మరికొన్ని లావాదేవీలుంటాయి. ఆ సంస్థల కార్యదర్శిల ద్వారా కబురెడితే కాకుల్లా వాల్తారు వీళ్ళు. ముకుందమే కళావాహినీ సంస్థపేరు సజెస్ట్ చేసాడు. నాకు కాస్త చేతి చమురు వదిలిందిలే"

"మీరింత కష్టపడి కార్యక్రమాన్ని నిర్వహించినా, మావయ్యగారిలో ఏ కోశానా ఆనందం లేదు. ఆ దిగులెందుకో తెలియదు. ఆయన సంతోషంగా లేకపోతే ఇంట్లో దీపం లేనట్టు వుంటుంది. దిగులెందుకో తెలుసుకోలేరా?"

సమయం, సందర్భం వస్తే ఆయనే బయటపడతారు. కంగారు పడకు" అన్నారు తిలక్.

"నాన్నగారూ! మీరన్నకున్నట్టు పుస్తకావిష్కరణ జరిగింది. కాని ఎందుకో మీకది తృప్తిగా లేదనిపిస్తోంది. నా తప్పు ఏదైనా వుంటే చెప్పండి దిద్దుకుంటా"

"నీ తప్పేం లేదురా! నేను మామూలుగానే వున్నా" నీరసంగా మొక్కుబడిగా అన్నారు నారాయణరావుగారు.

ఇంతలో పద్మ కంగారుగా వచ్చింది.

"ఏమండీ! బుజ్జిగాడు లంచ్‌బాక్స్ మర్చిపోయి స్కూలుకెళ్ళిపోయాడు. వెర్రినాగన్న ఆకలికి తట్టుకోలేడు. ఇప్పుడెలా?" అంటూ గాబరాగా దిగులుగా భర్తకేసి చూసింది.

"వండిన అన్నం పిల్లలు తినకపోతే తల్లి తల్లడిల్లిపోతుంది. రచయితకూడా అంతే. తను రాసింది పాఠకులకి చేరకపోతే - చెత్తకుప్పకి చేరువైతే చలించిపోతాడు" అంటూ పుస్తకావిష్కరణ సభలో జరిగింది చెప్పడం మొదలెట్టారు నారయణరావు మాష్టారు.

"సభ పూర్తి అయ్యాక నా ఆనందభాష్పాల్ని, క్షణం కూడా నిలనీయక కన్నీళ్ళు కలగాపులగం చేసాయి. నా కన్నీళ్ళ పొరలోంచి వేదిక క్లీన్ చెయ్యడానికి వచ్చిన స్వీపరు చీపురుతో కనబడ్డాడు. అక్కడున్న నలిగిన బొకేల్ని, వాడిన పూల మాలల్ని, రాలిన పూలరేకుల్ని చెత్తని తుడిచి గోనెసంచిలో వేసాడు. చెత్తతో పాటు అక్కడ వేసిన ఆవిష్కరించిన పుస్తకాల్ని కూడా గోనె సంచిలో పడేసాడు. నానోట మాట రాలేదు. నిర్ఘాంతపోయి చూస్తూ వుండిపోయా. కడుపున పుట్టిన బిడ్డను పీక పిసిగి చెత్తకుండీలో పారేసినట్టు గిలగిల్లాడిపోయా. ఆవిష్కరించిన వాళ్ళకే ఆ పుస్తకం విలువ తెలియకపోతే, రచయితకి అంతకంటే అవమానం మరొకటి వుండదురా"

తండ్రి బాధ అప్పుడర్థమయింది తిలక్‌కి.

"ఎద్దుకేం తెలుస్తుంది అటుకుల రుచి. విలువలు తెలియని వాళ్ళకి విచక్షణాజ్ఞానం వుండదు. అర్హతలేని వాళ్ళని అందలం ఎక్కనివ్వకూడదు. సంస్కారంలేని వాళ్ళచేత అలాటి పవిత్రమైన పనులు చేయించకూడదు. మనిషిని అర్ధం చేసుకుందుకు మంచీ, చెడూ, రెండూ చూడాలి నాన్నగారూ. ప్రాప్తం వున్నవాడి చేతులకి ఆ పుస్తకాలు తప్పక చేరుకుంటాయి. మీకా సరస్వతీ అనుగ్రహం వుంది దిగులుపడకండి."

"ఎంతటి గొప్పవాడైనా, అహంకారంతో అక్షరాన్ని దుర్వినియోగం చేసుకోకు. పెద్దలు పిల్లలకి యివ్వవలసింది ఆస్తులుకాదు అక్షరజ్ఞానం అని మన వేదాలు చెబుతున్నాయి" అన్నారు తేలికపడ్డ మనసుతో నారాయణరావుగారు.

ఆరోజు వసంత పంచమి. సరస్వతీదేవి పుట్టినరోజు. నారాయణరావు మాష్టారింట్లో చిన్నహాలు పిల్లలతో కిక్కిరిసిపోయి నిశ్శబ్దంగా వుంది. పిల్లలు మౌనంగా మూక పంచ సతి చదువుతున్నారు.

ముకుందం భార్యతో మూడేళ్ళ కొడుకుని తీసుకుని అక్కడికి వచ్చాడు. నిశ్శబ్దాన్ని భంగపరచలేక తనూ సర్దుకు కూర్చున్నాడు.

అప్పుడే ఓ పదారేళ్ళ అమ్మాయి వచ్చి గుమ్మం బయట నుంచుంది. అట్టలు కట్టిన జుట్టు, మాసిన బట్టలు, మెరిసేకళ్ళు, తోమని కంచు దేవతా విగ్రహంలా వుంది.

"ఏం కావాలమ్మా!" అని అడిగారు మాష్టారు.

"సారూ! నా పేరు సరసమ్మ. పదో తరగతి సదువుతున్నా. అనాదను" అంటూ దణ్ణం పెట్టింది.

"కూర్చో అమ్మా" అన్నమాట నోటినుంచీ రాగానే, లోపలికి వచ్చి పూజా విగ్రహం ముందర ప్రతిష్ఠింపచేసిన ప్రతిమలా నేలమీద కూర్చుని "సారూ! రోజూ నేను ఇంటింటికి తిరిగి సెత్త తీసుకుని, రిచ్చాలో తీసుకెళ్ళి డంప్ యార్డ్‌లో పడేత్తూ వుంటా మా కాంట్రాక్టర్ గారిచ్చిన డబ్బులే నా సదువుకి, తిండికి ఆధారం.

నేను సెత్త ఎత్తుతూంటే, మీరు రాసిన 'సులభగణితం' పుత్తకం సిరిగిపోయి, కుట్లూడిపోయి కొన్నిపేజీలు దొరికాయి. ఇంకో పుత్తకం అట్టమాత్రం దొరికింది.

మొదటి పేజీలో వున్న మీ ఎడ్రసు సూసి ఇల్లు ఎతుక్కుంటూ వచ్చా. అయ్యగోరూ నాకో మంచి పుత్తకం యివ్వరా? బీదదాన్ని ఇంతకంటే ఇచ్చుకోలేను" అంటూ గుప్పెడు చిల్లర డబ్బులు, రెండు నలిగిన నోట్లు మాష్టారి పాదల దగ్గర పెట్టింది సరసమ్మ

తను ఆవిష్కరించిన పుస్తకాల్ని నిర్లక్ష్యంగా వేదిక మీద వదిలేసిన సంగతి గుర్తొచ్చి కొరడా పెట్టి కొట్టినట్టయి, అంతర్మథనం మొదలయింది ముకుందానికి.

సరసమ్మ మాటలకి నారాయణరావుగారి మనసు ద్రవించిపోయింది. కన్నీళ్ళ పొరలోంచి సరసమ్మ కళ్ళల్లో చదువుమీద కాంక్ష కనబడింది. ఒక్కసారిగా ఆయన దిగులు పఠాపంచలయింది. ఉత్సాహం ఉరకలెత్తింది. కాళ్ళదగ్గరున్న డబ్బుని కళ్ళకద్దుకుని "ఇది వుండాల్సిన స్థానం ఇక్కడ" అంటూ సరసమ్మ చేతిలో పెట్టి "నీ చదువుకి ఏ ఇబ్బందీ పడకమ్మా అమ్మ ఆశీర్వాదాలు నీకున్నాయి" అని లోపలికెళ్ళి పెద్దపుస్తకాల కట్ట తీసుకొచ్చి "ఈ పుస్తకాల్ని తీసుకెళ్ళి చదువుకునే పిల్లలకి ఉచితంగా పంచిపెట్టు. ఆ సరస్వతే నీ రూపంలో ఈ పుణ్యదినాన మా యింటిని పావనం చేసింది. నా జన్మ ధన్యమైంది. నా రచనకి ప్రయోజనం కలిగింది. ఆ పుల్లాబ్జాక్షి నీ చేతులు మీద ఇప్పుడే, ఇక్కడే నా పుస్తకాల్ని ఆవిష్కరణ చేయిస్తోంది" అంటూ పుస్తకాలు సరసమ్మ చేతిలో పెట్టి 'సరస్వతీ నమస్తుభ్యం' అనుకుంటూ కళ్ళుమూసుకుని అలౌకికమైన ఆనందంతో ప్రార్థిస్తూంటే, మాష్టారికి తెలియకుండానే ఆనందభాష్పాలు పుస్తకాల్ని అభిషేకించాయి.

ఇంతలో మాష్టారి కాళ్ళమీద రెండు కన్నీటి చినుకులు. పైకి చూసేసరికి ముకుందం కళ్ళల్లో నీళ్ళు, మొహంలో పశ్చాత్తాపం కొట్టొచ్చినట్టు కనబడింది మాష్టారికి.

అక్షరాన్ని అనేకసార్లు దుర్వినియోగం చేసినందుకు, సరస్వతీ పీఠానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసినందుకు ప్రతిఫలంగా, నాన్నమాట వినబడటంలేదు. అమ్మా! అని నోరారా పిలవలేక మౌనంగా ఆ అమ్మలగన్న అమ్మకి నమస్కరిస్తున్న కొడుకుని చూసి కుమిలి కుమిలి ఏడ్చాడు ముకుందం.

.

Click here to share your comments on this story